ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

సోమవారం 5 ఫిబ్రవరి 2024

కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసి పోయిన వనదేవతల గద్దెల ప్రాంగణం



భక్త జన హోరు

వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం

- వారాంతపు రోజు భక్తుల కిటకిట
- భారీగా ముందస్తు మొక్కులు



మేడారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహా జాతరకు ముందుగానే సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంతపు సెలవు కావడంతో కుటుంబ సమేతంగా మేడారం చేరుకున్నారు. ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి వనదేవతల గద్దెల వద్దకు క్యూలైన్ల ద్వారా చేరుకొని మొక్కులు చెల్లించారు. సుమారు ఐదు లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

- మేడారం

7

డబ్బులు పాయే.. ఇల్లు రాకపాయే..



చిన్నగూడూరులో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

చిన్నగూడూరు, ఫిబ్రవరి 4: కూటి కోసం కోటి తిప్పలు.. ఇది ఒకప్పటి మాట... గూడు కోసం (డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు) కోటి తిప్పలు ఇది ఇప్పటి మాట... నిలువ నీడలేని నిరుపేదలు స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక డబుల్ బెడ్‌రూమ్‌ను దక్కించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చిన్నగూడూరు మండల కేంద్రంలో ఇదే అదునుగా భావించిన పూర్వంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని పేదల నుంచి డబ్బులు వసూలు చేశారు. కూలి... నాలి పనులు చేసుకుంటూ నోరు కట్టుకుని రెక్కల కష్టంతో కూడబెట్టిన డబ్బును సొంతింటి కల నెరవేర్చుకునేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం ఇస్తే ఆ... పైసలు పాయే... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాకపాయే... దీంతో ఆవేదనకు గురైన ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది.

వంద ఇళ్ల నిర్మాణం..

జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని చిన్నగూడూరు మండల కేంద్రానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 100 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. రూ.5 కోట్ల వ్యయంతో ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు మార్చి, 2022లో అప్పటి ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేసరికి అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ జరగలేదు. అయితే ఇళ్ల కోసం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు కొంత మంది డబ్బులు ఇవ్వడంతో వారు ఇంటి నెంబర్లు కేటాయించి డబ్బులిచ్చిన వారికి తాళాలు ఇచ్చారు. దీంతో వారు తామే లబ్ధిదారులమని గృహాలకు 12 అక్టోబరు, 2023న రాత్రి తాళాలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న నిరుపేదలు సంపన్నులకు ఎలా కేటాయిస్తారని ఆగ్రహంతో తాళం వేసిన ఇంటికి మరో తాళం వేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎవరికి కేటాయించలేదని అక్కడ నోటీసు పెట్టారు. డబ్బులు ఇచ్చిన కొంత మంది వ్యక్తులు ఆందోళన చెందడంతో డబ్బులు వసూలు చేసిన నాయకుడు మళ్లీ బీఆర్‌ఎస్ వస్తుంది.. అధైర్య పడవద్దు.. మీకు తప్పక ఇళ్లు ఇస్తామని చెప్పి నమ్మిస్తూ వచ్చాడు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరుపై ఆశలు సన్నగిల్లడంతో ఇచ్చిన డబ్బులు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళన వారిలో మొదలైంది. డబ్బులు ఇచ్చిన వారు ఒక్కొక్కరిగా బయటకు వస్తూ గగ్గోలు పెడుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం డబ్బులు వసూలు చేసిన బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్లకు వెళ్లి నిలదీస్తున్నారు.

- ఒక్కొక్కరి నుంచి రూ.1.70 లక్షలు వసూలు
- చిన్నగూడూరులో 100 ఇళ్లు.. 255 దరఖాస్తులు
- మహిళ ఫిర్యాదుతో బీఆర్‌ఎస్ నేతపై చీటింగ్ కేసు



గతంలో డబుల్ ఇళ్లకు రెండేసి తాళాలు వేసిన దృశ్యం (ఫైల్)

రూ.1.70 లక్షల చొప్పున వసూలు

మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కావాలనే ఆశావహుల తాకిడి గ్రామంలో పెరగడంతో ఇదే అదునుగా ఒక్కో ఇంటికి రూ.1.70 లక్షలుగా బీఆర్‌ఎస్ నాయకులు నిర్ణయించారు. ఆ నగదు ఇచ్చిన వారికే ఇళ్లు కేటాయిస్తామని చెప్పడంతో గ్రామంలో 100మంది బీఆర్‌ఎస్ మండల నాయకుడు, స్థానిక లీడర్‌కు ఒక్కొక్కరు రూ.1.70లక్షలు ఇచ్చారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కాగా, చిన్నగూడూరుకు చెందిన ఓ మహిళ తన భూమిలో ఐదు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారని, తాను పెట్రోల్‌తో నిరసన వ్యక్తం చేసినా న్యాయం జరగక పోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. అయితే ఇళ్ల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 255 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, మరికొందరు ఇళ్ల నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ నాయకులకు, కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇచ్చామని, తమకే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేతపై కేసు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం డబ్బులిచ్చిన వారు చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్ బాట పడుతున్నారు. గత జనవరి 29న గ్రామానికి చెందిన కొడిదెల సత్తెమ్మ తనకు బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఇల్లు ఇప్పిస్తానంటే రూ.1.70 లక్షలు ఇచ్చానని వాపోయింది. ఇల్లు రాలేదని తన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఇచ్చినట్లుగా సాక్ష్యం ఉందా.. అని బీఆర్‌ఎస్ నేత సమాధానం ఇవ్వడంతో మోసపోయినట్లు గుర్తించిన సదరు మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బీఆర్‌ఎస్ నేతపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

> **ఇళ్లు ఎవరికీ కేటాయించలేదు.. : మహబూబ్ అలీ, తహసీల్దార్**
>
> డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తాం.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

- బీఆర్‌ఎస్ పాలనలో నిధులు రాక ఆర్థిక ఇబ్బందులు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



పట్టణంలో తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4 : పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర క్రియాశీలకమని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలకు నిధులివ్వకపోవడంతో సర్పంచ్‌లు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అయినప్పటికీ నిత్యం ప్రజల మధ్య ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో వారు ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. పదవీ విరమణ అనేది కేవలం పదవికి మాత్రమేనని.. సేవకు కాదని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమైన నేతలకు మళ్లీ అవకాశాలు వస్తాయని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగేంత వరకు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపడంలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నదని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు గుగులోతు దస్రూనాయక్, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, వివిధ మండలాల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, కదిరె సురేందర్, ప్రభాకర్, వెన్నం లక్ష్మారెడ్డి, సత్యపాల్‌రెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, శంతన్‌రామరాజు, పోతురాజు రాజు, కోడి శ్రీను, హరిసింగ్, లింగస్వామి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ మానుకోట అసెంబ్లీ ఇన్‌చార్జిగా భాస్కర్‌రెడ్డి



మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4: భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ అసెంబ్లీ ప్రబారీ(ఇన్‌చార్జి)గా చింతలపుడి భాస్కర్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇన్‌చార్జీలను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రానికి చెందిన చింతలపుడి భాస్కర్‌రెడ్డిని మానుకోట అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించారు. భాస్కర్‌రెడ్డి గతంలో ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీలో గత 35 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పని చేసిన భాస్కర్‌రెడ్డిని మహబూబాబాద్‌కు నియమించారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

- కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్ బలోపేతం
- మోదీ హయాంలో మహిళలకు కరువైన రక్షణ
- మహిళా కాంగ్రెస్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4 : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు లోకసభ స్థానాలను పార్టీ కైవసం చేసుకునేందుకు మహిళా కాంగ్రెస్ నాయకులు అంకితభావంతో కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల క్రమంలో వరంగల్ సెగ్మెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం జరిగింది. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి సునితారావు మాట్లాడుతూ.. కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, ఈ మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో వార్డు స్థాయి నుంచి జిల్లా కమిటీల వరకు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షులను ఆదేశించారు. నామినేటెడ్ పోస్టుల్లో మహిళా కాంగ్రెస్ నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరనున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం జరపాలని సునితారావు సూచించారు. గ్యారంటీల ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ కవిత తన స్థాయిని మించి మాట్లాడుతోందని సునితారావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధినేత్రి ప్రియాంకగాంధీ గురించి ఇష్టారీతిలో మాట్లాడడం అనైతికమన్నారు.

సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందనేది కవిత మరిచిందని, ఆమెకు మతిభ్రమించిందని మండిపడ్డారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేబోమని స్పష్టం చేశారు. మోదీ హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రగల్భాలతోనే మోదీ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు.

మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లి మహిళలకు వివరించాలన్నారు. ఇప్పటికే ప్రకటించిన రెండు గ్యారంటీలతో మహిళలు సంతోషంగా ఉన్నారని, త్వరలో మరో రెండు గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనున్న క్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం జరపాలని సూచించారు. వరంగల్‌లోని రెండు లోక్‌సభ స్థానాల్లో పార్టీ విజయానికి అండగా నిలవాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు.

సమష్టిగా కృషి చేద్దాం

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి, గ్రామ, మండల, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కనుమరుగు కానున్న బీఆర్‌ఎస్, కమ్యూనిస్టులు

- నేటి నుంచి గ్రామ్ చలో యాత్ర
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కమ్యూనిస్టులు కనుమరుగవుతారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు సన్మాన సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇక రెండు అంకెలకే పరిమితమైందని చెప్పారు. ఇండియా కూటమి కుప్పకూలిపోయిందని, ఆ కూటమికి 40 ఎంపీ స్థానాలు మాత్రమే వస్తాయని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. రామాలయ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నేతలను ఆహ్వానించినప్పటికి వేడుకలకు హాజరు కాకుండా వారి నైజం చూపించారన్నారు. తెలంగాణపై బీజేపీ ఫోకస్ పెట్టిందన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు గ్రామ్ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు బూత్ స్థాయిలో 24 గంటల పాటు ఉంటారని పేర్కొన్నారు. 10 నుంచి 16వ తేదీ వరకు 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర చేపట్టడంతో పాటు సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై బీజేపీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి నేటికి అమలు చేయలేదని అన్నారు. దేశ ప్రజలందరూ ప్రధానిగా మోదీని మూడోసారి చూడాలనుకుంటున్నారన్నారు. తొలుత జిల్లా నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, గాదె రాంబాబు, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, శ్రీమాన్, బాలునాయక్, సురేందర్‌రెడ్డి, మల్లం యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, ఫిబ్రవరి 4 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో మినీ ట్రక్కులో తరలిస్తున్న 35 క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు రెండు క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం ఎస్సై సంతోషరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతుండగా అటుగా వచ్చిన వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 70 బస్తాల్లో ఉన్న నల్లబెల్లంతో పాటు రెండు క్వింటాళ్ల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన కురవి మండలం మొగిలిచర్లకు చెందిన దేశబోయిన వెంకన్న, గుంటూరుకు చెందిన పరమేష్, శివప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. రవాణాకు ఉపయోగించిన మినీ ట్రక్కును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

- టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రవి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కార్యవర్గంలో మార్పులు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంతోజు ఓంకార్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ రాజేష్, తిరుపతిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా డాక్టర్ నాగరాజు, నీలం రమేష్, కొప్పుల నాగరాజు, రోహిత్, రవీందర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, సురేష్, రమేష్, రవికుమార్, మహిళా ఉపాధ్యక్షురాళ్లుగా ఉషారాణి, లక్ష్మీదుర్గాదేవి, ఐటీ సెల్ కన్వీనర్‌గా రఫిక్, జాయింట్ సెక్రటరీలుగా మేకల కుమార్, అజయ్, భాస్కర్, నజీముద్దీన్, కమలాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శంకర్‌గౌడ్, ఇబ్రహీం, మధులను నియమించినట్లు రవి తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగముని లక్ష్మీకాంత్, మోహిన్ అహ్మద్, వీరన్న, భాస్కర్, శ్రీనివాస్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్, హనుమకొండ నగర శివార్లలో కొంత కాలంగా లంపెన్ గ్యాంగులు, నకిలీ పోలీసుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. తాగుడు తదితర జల్సాలు, విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడి ఒళ్లు వంచి పనిచేయ చేతకాని కొందరు యువకులు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తప్పులు చేస్తూ దొరికేవరకు దొరల్లా తిరిగి దొరికిన తర్వాత దొంగల్లా జైలు జీవితం అనుభవిస్తున్నారు. నగర శివార్లలో ఉన్న వ్యభిచారగృహాలు, ఒంటరి మహిళలు, ప్రేమ జంటలను టార్గెట్ చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. రోజు రోజుకూ నగర శివార్లలో నకిలీ పోలీసులు, దోపిడీ గ్యాంగుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయే తప్ప తగ్గడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'చిల్లర' గ్యాంగులు!

- నగర శివార్లలో రెచ్చిపోతున్న ఆకతాయిలు
- వ్యభిచార గృహాలు, ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీ పర్వం
- వంగపహాడ్‌లో పోలీసులమంటూ బెదిరింపులు, దాడులు
- అరెస్టు చేసి జైలుకు తరలించిన పోలీసులు
- మిగతా ప్రాంతాలపై కూడా దృష్టి సారించాలంటున్న జనం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 4: హనుమకొండ, వరంగల్, కాజీపేట శివారు గ్రామాల్లో చిల్లర గ్యాంగులుగా ఏర్పాటు చేసుకున్న యువకులు రెచ్చిపోతున్నారు. నగరం నుంచి ఒంటరిగా గ్రామాలకు వెళ్లే మహిళలను, అమాయకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారు. ముందుగా ఆటోలో కానీ.. ద్విచక్రవాహనంపైగానీ వెళ్లే వారిని వెంబడించి మార్గమధ్యలో అడ్డుకుని బంగారం, నగదును లాక్కొని వెళుతున్నారు. కొందరైతే ఈ ప్రాంతంలో దొంగలుగా సంచరిస్తున్నారు. మెడలో ఉన్న సొమ్ములు తీసిదాచుకోమని చెప్పి మాటలతో మభ్యపెట్టి బంగారం దోచుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల నకిలీ పోలీసులు, జులాయిలు శివారు గ్రామాల రహస్య ప్రదేశాలలో మద్యం తాగుతూ ప్రేమ జంటల కోసం కాచుకుని కూర్చుంటారు. ప్రేమజంటలు, కళాశాల విద్యార్థులు అటువైపు రాగానే తొలుత యువకుడి వద్ద నుంచి బైక్ తాళాన్ని లాక్కుంటారు. ఐడీ కార్డును తీసుకుని వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో వారి ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తారు. తల్లి దండ్రుల ఫోన్ నెంబర్లు ఇవ్వాలని బెదిరిస్తారు. ఆ తర్వాత తాము పోలీసులమని, స్టేషన్‌కు తీసుకెళతామంటూ భయభ్రాంతులకు గురిచేయడంతో ఏటీఎంల నుంచి డబ్బులు డ్రా చేసి మరీ ఇచ్చిన జంటలున్నట్టు సమాచారం.

గతంలో కేయూ, హసన్‌పర్తి, ధర్మసాగర్, మిల్స్‌కాలనీ పీఎస్‌ల పరిధిలో ప్రేమజంటలను చితకబాది దోపిడీ చేసి జైలుకు వెళ్లిన ఘటనలున్నాయి. అదే విధంగా పెద్దమ్మగడ్డ, రంగశాయిపేటకు చెందిన కొందరు యువకులు ఇదే తరహా దారి దోపిడీలకు పాల్పడి జైలుకు వెళ్లారు. ఆత్మకూరు మండలానికి చెందిన మరో యువకుడు ఒగ్లాపూర్ సైలానీబాబా సమీపంలో మహిళలను, ప్రేమ జంటలను అడ్డగించి పోలీసులమని అటకాయించి బైకులు, డబ్బులు, బంగారు ఆభరణాలు, విలువైన సెల్‌ఫోన్లు లాక్కుని పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. అలాగే ఇలాంటి ఘటనలు ఎక్కువగా కేసీ కెనాల్ ప్రాంతం, కొత్తపేట, దామెర, ఒగ్లాపూర్, అనంతసాగర్, బొల్లికుంట, వంగపహాడ్, గొర్రెకుంట, ఆటోనగర్, శివనగర్, జక్కలొద్ది, కొండపర్తి, సింగారం, గవిచర్ల, కడిపికొండ, ప్రకాశ్‌రెడ్డిపేట, మడికొండ, ఉనికిచెర్ల, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి, పలివెల్పుల, పెగడపెల్లి, రెడ్డిపురం గ్రామ శివార్లలో జరుగుతున్నట్టు సమాచారం. తాజాగా నగరానికి అనుకుని ఉన్న వంగపహాడ్ గ్రామంలో వ్యభిచార గృహాలకు వచ్చిన విటుల నుంచి నగదు, బంగారం, వాహనాలను దోపిడీ చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.

బ్లాక్‌మెయిల్

హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో కొన్నేళ్లుగా కొన్ని కుటుంబాలు పడుపు వృత్తిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నాయి. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అదే గ్రామానికి చెంచిన యువకులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు రాత్రి సమయాల్లో వ్యభిచార గృహాల వద్దకు వచ్చే వారిని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్నారు. విటుల ఫొటోలు, వీడియోలు తీస్తూ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు, బంగారం లాక్కుంటున్నారని ఆవేదన చెందారు. కొందరిపై భౌతికదాడులు చేస్తూ డబ్బుల కోసం హింసిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడగా, ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి.

పట్టించుకోని పోలీసులు

నగర శివారు ప్రాంతాల్లో చాలాచోట్ల చిల్లర గ్యాంగులు నకిలీ పోలీసులుగా చెలామణి అవుతూ దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నా పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫ్రెండ్లీ పోలీసులని నమ్మకంతో కొందరు బాధితులు, విద్యార్థులు ఫిర్యాదు చేస్తే యేడాది దాటుతున్నా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు.. విస్మరించడంతోపాటు లంపెన్ గ్యాంగులకు సహ కరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. వంగపహాడ్, సిద్ధాపూర్, గీసుగొండ, హసన్‌పర్తి, చలపర్తి, ల్యాదెళ్ల గ్రామాలను అనుకుని ఉన్న కొన్ని వ్యభిచార గృహాల నిర్వాహకులకు నకిలీలు, లంపెన్ గ్యాంగుల నుంచి దోపిడీకి గురికాక తప్పడం లేదని వాపోతున్నారు.

పోలీస్ బాస్‌లు శ్రద్ధ కనబర్చాలి

పోలీసు బాస్ అంబర్ కిశోర్ ఝా నగర శివార్లలో కలకలం రేపే నకిలీ పోలీసులు, చిల్లర గ్యాంగులపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కమిషనరేట్‌లో పోలీసు నిఘా వ్యవస్థ నిద్రమత్తులో ఉండడం, టాస్క్‌ఫోర్స్ టీమ్స్ అప్రమత్తంగా లేకపోవడం, పోలీసు పెట్రోలింగ్ బందాలు గస్తీ నిర్వహించకపోవడం వల్లనే కొందరు అకతాయిలు నకిలీ పోలీసుల అవతారం ఎత్తి శివార్లలో రెచ్చిపోతున్నారని అంటున్నారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నకిలీలను ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా నకిలీలపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మళ్లీ 'పైరవీ' బదిలీలు

హాట్ టాపిక్‌గా మారిన 'చెక్ స్లిప్ ట్రాన్స్‌ఫర్స్' ● ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఫారసులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: మళ్లీ చెక్ స్లిప్(పైరవీ) బదిలీలు తెరపైకి వస్తున్నాయి. పైరవీల బదిలీల కోసం అనారోగ్య సమస్యలంటూ కొంతమంది ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీల కోసం పైరవీలు షురూ చేస్తున్నారు. గత ఏడాది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కంటే ముందుగానే కొంతమంది ఉపాధ్యాయులు చెక్ స్లిప్ బదిలీలతో ఇతర జిల్లాలకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగానే పైరవీల బదిలీలు జరగగా, ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఉపాధ్యాయులు ఈ నేపథ్యంలోనే బదిలీ అయ్యారు. అప్పుడది విద్యాశాఖలో పెద్ద దుమారం లేపడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్ స్లిప్ బదిలీలకు చెక్ పెట్టింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా పాలకవర్గ నేతలు సిఫారసులు చేస్తుండటంతో విద్యాశాఖలో బదిలీల పరంపరకు తెరతీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ (డీఎ్‌ఎఈ) కార్యాలయం నుంచి డీఈవోలకు కొంత మంది ఉపాధ్యాయుల బదిలీల కోసం రిమార్కులు అడుగుతున్నట్లు సమాచారం.

చెక్ స్లిప్ బదిలీలన్నీ అక్రమ బదిలీలే..

చెక్ స్లిప్ పేర్లతో వస్తున్న బదిలీలన్నీ అక్రమ బదిలీలే అంటూ ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గాలను ప్రసన్నం చేసుకుంటూ కొంతమంది ఉపాధ్యాయులు అక్రమబదిలీలు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్య కారణాల పేరుతో అధికారులను బురిడీ కొట్టిస్తూ రిమోట్ ఏరియాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చేందుకు కొంతమంది ఉపాధ్యాయులు పావులు కదుపుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని హెచ్‌ఆర్‌ఏ సౌకర్యం ఉన్న పాఠశాలలనే ఎంపిక చేసుకుంటూ పైరవీ బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిజంగా అనారోగ్య కారణలుంటే సాధారణ బదిలీల్లో వారికి ప్రిఫరెన్షియల్ కేటగిరీల్లో పాయింట్లు వస్తాయని, అప్పుడు వారు పట్టణ ప్రాంతాల్లోకే బదిలీలు అవుతారని, అలా కాకుండా అనారోగ్య కారణాలు చూపుతూ లక్షల రూపాయలు లంచాలు అందజేస్తూ అక్రమ బదిలీలు చేయించుకుంటున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

సిఫారసుల్లో హుకుం

సాధారణంగా ప్రజాప్రతినిధులు ఎవరికైనా ఉద్యోగికి సిఫారసు చేస్తే సందర్భాన్ని బట్టి తాము సిఫారసు చేసిన పనులు చేయాల్సిందిగా అధికారులను ప్రజాప్రతినిధులు కోరుతారు. అయితే ఉపాధ్యాయుల పైరవీ బదిలీలకు సిఫారసులు చేస్తున్న ప్రజాప్రతినిధులు మాత్రం పని తప్పకుండా చేయాలంటూ సిఫారసు లేఖల్లోనే హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ ప్రజాప్రతినిధుల నుంచి హుకుంతో కూడిన సిఫారసు లేఖలు అందుతుండడంతో అధికారులు సైతం ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది ఉన్నతాధికారులు సైతం హుకుంతో కూడిన సిఫారసు లేఖలతో ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి పలువురి సిఫారసు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సుమారు 10 మంది ఉపాధ్యాయులకు పైగా సిఫారసు లేఖలతో హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగానే సిఫారసు లేఖలు సమర్పించిన కొంత మంది ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఫైళ్లు సంబంధిత డీఈవోలకు వివరణ కోసం పంపించినట్లు సమాచారం. ఖాళీల వివరాలతోపాటు, సంబంధిత ఉపాధ్యాయులు కోరుకుంటున్న పాఠశాలల్లో ఖాళీల వివరాలు సమర్పించి సమగ్ర సమాచారం అందజేయాలని డీఈవోలకు సంబంధిత ఉన్నతాధికారి లేఖలు పంపించినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా నుంచి హనుమకొండ జిల్లాకు ఒకరు, ములుగు జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు ఒకరు, మహబూబాబాద్ జిల్లా నుంచి జనగామ జిల్లాకు ఒకరు, ఆసిఫాబాద్ జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులకు సంబంధించిన ఫైళ్లు ఆయా జిల్లాల డీఈవోలకు చేరుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

డిప్యూటేషన్ల కోసం యత్నాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఈనెల 2న డిప్యూటేషన్ల బదిలీల ఉత్తర్వులు జారీ కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొంత మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ బదిలీల కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వరంగల్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సర్దుబాట్లు జరిగిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సైతం ఈ జిల్లా నుంచి జోరుగానే అక్రమ డిప్యూటేషన్లకు తెరతీసేందుకు ఇక్కడి అధికారులు సైతం సిద్ధం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ అక్రమ డిప్యూటేషన్ బదిలీల కోసం కొంత మంది ఉపాధ్యాయులు అధికారులను, మరికొంత మంది ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అక్రమ బదిలీలపై సీఎం దృష్టిపెట్టాలి

చెక్ స్లిప్ పేర్లతో ప్రజాప్రతినిధుల సిఫారసులతో అధికారులు చేపడుతున్న అక్రమ బదిలీలపై ముఖ్యమంత్రి చొరవ తీసుకొని అక్రమ బదిలీలను నిరోధిస్తూ చర్యలు తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాటు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే అక్రమార్కులకు కొమ్ముకాస్తూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలంటూ కోరుతున్నారు. సాధారణ బదిలీలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పర్యవేక్షణాధికారుల కొరత, ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొసున్న విద్యారంగాన్ని గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నల్లా భాస్కర్‌రెడ్డి మృతదేహం

నయింనగర్, ఫిబ్రవరి 4: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కల గుట్ట వద్ద గల హరిత కాకతీయ హోటల్‌లో నల్లా భాస్కర్‌రెడ్డి(35) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన నల్లా భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఓ ప్రయివేటు చిట్‌ఫండ్స్ కంపెనీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేసేవాడు. భాస్కర్‌రెడ్డి చిట్‌ఫండ్స్‌లో చాలా మంది ఖాతాదారులతో దాదాపు రూ.5 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించినట్లు ఎస్ఐ తెలిపారు. చిట్‌ఫండ్స్ యజమానులు ఖాతాదారులకు వారి డబ్బు ఇవ్వకపోవటంతో ఖాతాదారులు భాస్కర్‌రెడ్డిపై ఒత్తిడి చేసేవారు. అలాగే ఆరు నెలలుగా చిట్‌ఫండ్ కంపెనీ వారు జీతాలు ఇవ్వడం లేదు. దీంతో భాస్కర్‌రెడ్డి చాలా రోజుల నుంచి ఒత్తిడికి లోనై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడని తన భార్య శామిలి తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ క్రమంలో శుక్రవారం భాస్కర్‌రెడ్డి తన భార్యకు బయటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో తన భార్య భాస్కర్‌రెడ్డి స్నేహితులకు ఫోన్ చేసి చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఆచూకీ కోసం అతడి స్నేహితులు అన్ని ప్రాంతాలు వెతకగా మృతుడి కారు హరిత కాకతీయ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే హోటల్ సిబ్బందిని విచారించగా రెండు రోజుల నుంచి హోటల్‌లో ఉంటున్నట్లు సిబ్బంది తెలిపినట్లు వారి స్నేహితులు తెలిపారు. హోటల్ గదికి వెళ్లగా లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉందని, హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా భాస్కర్‌రెడ్డి గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతుడు భాస్కర్‌రెడ్డికి భార్య శామిలి, ఇద్దరు కుమారులు మణికంఠరెడ్డి, విద్యావన్‌రెడ్డి ఉన్నారు. మృతుడి భార్య శామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపారు.

తెలుగులో పద్మకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4: కేయూ తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కం పద్మ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం పద్మకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. తిక్కన మహాభారతం -మౌసల నుంచి స్వర్గరోహణ పర్వాములు- విమర్శనాత్మక పరిశీలన ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్, కేయూ ఆర్ట్స్ తెలుగు మాజీ డీన్, రిటైర్డు ప్రొఫెసర్ కొంకా యాదగిరి పర్యవేక్షణలో పద్మపరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగు ణకు చెందిన పద్మ నల్లగొండలోని టీఎస్‌టీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన పద్మను పలువురు అభినందించారు.

నవోదయలో ఖాళీల భర్తీకి సన్నాహాలు

- 9, 11వ తరగతిలో ప్రవేశాలకు 2,980 దరఖాస్తులు
- ఈనెల 10న ప్రవేశ పరీక్ష : ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ



జఫర్‌గడ్, ఫిబ్రవరి 4: జవహర్ నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి అధికారులు సన్నాహాలు చేపట్టారు. 2024-25 విద్యా సంవత్సరానికి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,980 దరఖాస్తులు రాగా, ఇందులో 9వ తరగతికి 1,480, 11వ తరగతికి 1,500 చొప్పున వచ్చాయన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణకు 9వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో నాలుగు, మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఒకటి చొప్పున 5 పరీక్షా కేంద్రాలు, 11వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ఆయా కేంద్రాల్లో ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకునిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుల (హాల్ టికెట్లు)ను నవోదయ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అయితే సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో పొందుపరిచిన వివరాలకు.. అడ్మిట్ కార్డుల్లో గల వివరాలకు ఏదేని తేడా కనిపిస్తే, ఇందుకు తగిన ధ్రువపత్రాలతో ఈనెల 7వ తేదీ వరకు మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

భక్తజన సందోహం

● వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం ● కిటకిటలాడిన గద్దె ప్రాంగణం



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 4: తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన సమ్మక్క - సారలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు ప్రవాహంలా తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవాప్యంతా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈనెల 21 నంచి 24 వరకు మహాజాతర జరగనుండగా ఆ సమయంలో కోటిన్నర మందికి పైగా భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. ఈ నేపథ్యంలో అధిక మంది భక్తులు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. తిరిగి మహా జాతరలో తల్లులకు ఎదురు మొక్కులు సమర్పించుకుంటామని అంటున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

మేడారం వనదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి ఐటీ కమిషనర్ బాలకృష్ణ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, హైకోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్, ఉట్నూరు రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్‌రెడ్డి వేర్వేరుగా మొక్కులు చెల్లించుకున్నారు.

కట్టుదిట్టంగా ట్రాఫిక్ నియంత్రణ

మహాజాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తుల వాహనాలతో మేడారం కిక్కిరిసిపోయింది. హరితహోటల్, చిలకలగుట్ట, శివరాంసాగర్, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు, వీవీఐపీ పార్కింగ్ పరిసరాల్లో భక్తులు విడిది చేయడంతో వేల సంఖ్యలో వాహనాలు చేరుకున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వాహనాలను రూట్ మొబైల్ పార్టీలు రోడ్డుపై నిమిషం ఆగకుండా పార్కింగ్‌లకు తరలించాయి. భక్తులు సులువుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, గద్దెల సమీపానికి చేరుకునేలా ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు వెయ్యి మంది పోలీసులు సేవలు అందించారు. భక్తుల భద్రత, వీవీఐపీ, వీఐపీ దర్శనాలతో పాటు క్యూలైన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆర్టీసీ సేవలు

భక్తులను మేడారం చేర్చడానికి వివిధ జిల్లాల ఆర్టీసీ డిపో సర్వీసులను అధికారులు వినియోగించారు. హనుమకొండ నుంచి మేడారం వరకు 67ట్రిప్‌లు, తిరిగి హనుమకొండకు 67 ట్రిప్‌లు నడిపినట్లు 52 సర్వీసులతో 5800 మందికి రవాణా సౌకర్యాలు కల్పించినట్లు ఆర్టీసీ ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివప్రసాద్ తెలిపారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని అన్నారు.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గద్దెల ప్రాంగణంలో గంట కొడుతున్న భక్తులు

భారత రాజ్యాంగంలో మార్పు రావాలి..

సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు



మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో మౌలికమైన కొన్ని మార్పులు రావలసిన అవసరం ఉందని సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు అభిప్రాయపడ్డారు. ఆదివారం హనుమకొండ లష్కర్‌బజార్ హైస్కూల్‌లో 'శ్రీ శారదా కృష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ భారత రాజ్యాంగం, సాంస్కృతిక వికాసం, పరిపాలనా ధోరణలు' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అల్ప సంఖ్యాక వర్గాలకు కల్పిస్తున్న రక్షణలు అధిక సంఖ్యాక వర్గాలకు కల్పించలేదన్నారు. అందువల్ల దేశంలో హిందూ మతం నానాటికీ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పర్యవసానంగా మత మార్పిడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ పరిస్థితి రాకుండా రాజ్యాంగ రక్షణలు ఉండాలన్నారు. రాజాశ్రయం లేకుండా మతాలు మనుగడ సాగించలేవని, ప్రపంచంలో ఇతర పెద్ద మతాలను తమ అధికారిక మతాలుగా దేశాలు ప్రకటించడంవల్ల అవి విస్తృతమౌతున్నాయని, కానీ హిందూ మతానికి అలాంటి అవకాశం లేదన్నారు. కనుక భారత రాజ్యాంగం చట్టపరమైన సరైన రక్షణలు కల్పించాలని నాగేశ్వర్‌రావు కోరారు.

ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల రంగారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ అష్టావధాని చేపూరి శ్రీరాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజా మనోహర్ బాబు, ఎన్‌వీఎన్ చారి, వరికొండ కాంతారావు, పాలకుర్తి దినకర్, పల్లేరు వీరస్వామి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమరవాది రాఘవ, క్రిష్టారావు, పరమేశ్వర్ రాజు, అడ్లూరి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి, భవ్యల మృతి దిగ్ర్భాంతికరం

విద్యార్థినుల కుటుంబాలకు అండగా ఉంటాం.. : మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లా గురుకుల విద్యార్థినులు వైష్ణవి, భవ్యలు ఆత్మహత్యకు గురి కావడం దిగ్ర్భాంతికి గురి చేసిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. విద్యార్థుల మృతికి మహిళా కాంగ్రెస్ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ అధ్యక్షతన హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా సునితారావుతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం మీడియా సమావేశంలో సునితారావు మాట్లాడారు.

గురుకుల పాఠశాల ఘటనపై విచారణ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పోలీస్‌అధికారులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. విద్యార్థినులు తొందరపాటు నిర్ణయాలకు గురి కావొద్దని సూచించారు. సమస్యలను ఎదురించాలి తప్ప.. ఆత్మహత్యలు పరిష్కారమే కాదన్నారు. జరిగిన సంఘటనతో తీవ్ర వేదనకు గురైనట్లు చెప్పారు. వైష్ణవి, భవ్య కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మహత్యకు గురి కావడం విచారకరమన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ మాట్లాడుతూ.. ఆత్మహత్యే పరిష్కారం అనుకుంటే ఎవరూ ఉండరన్నారు. ప్రతి మహిళా సమస్యలకు దీటుగా పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రాన్ని మునిసిపాలిటీగా చేయాలి


ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టెక్ మధు

కేసముద్రం, ఫిబ్రవరి 4 : కేసముద్రం మండల కేంద్రాన్ని మునిసిపాలిటీగా చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి తోట కుమారస్వామి అలియాస్ టెక్ మధు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతమైన కేసముద్రాన్ని కేంద్రంగా చేసుకొని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కేసముద్రం విలేజిలో సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 బ్యాచ్ విద్యార్థులు

కేసముద్రం, ఫిబ్రవరి 4 : కేసముద్రం విలేజి జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2005-06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 19 ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కొత్త జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో ఉంటే జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వాణి, సూర్యప్రకాశ్, బండి లక్ష్మయ్య, మధును శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బైరబోయిన అశోక్, గుండు శ్రీకాంత్, కుమార్, చక్రధర్, గణేష్, షైబెల్లి, ఖాసీం, నరేష్, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాస్, సంతోష్, వి.సుధాకర్, రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

▶▶ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్


సమావేశంలో మాట్లాడుతున్న నీలం దుర్గేష్

కేసముద్రం, ఫిబ్రవరి 4:ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 60 లక్షల మంది ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం సంఘటితంగా ఉండాలని కోరారు. సమావేశంలో మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, సింగని మహేష్, చిరుత వెంకటేశ్వర్లు, కె.వి.రమణ, జనిగల అనిల్, బుడిగబోయిన అశోక్, మంగి యాకయ్య పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి

▶▶ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్

గార్ల, ఫిబ్రవరి 4 : భువనగిరి సాయికృష్ణ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యలపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక వర్తక సంఘం భవనంలో ఆదివారం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు భవ్య యాదవ్, వైష్ణవిలను హత్య చేసి ఆత్మహత్యలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్న వార్డెన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో మీగడ శ్రీనివాస్, పల్లెబోయిన నాగరాజు, చేవుల మహేష్, తోట కొండల్‌రావు, పచ్చిపాల భిక్షం పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' పరీక్ష



మహబూబాబాద్‌లో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు, తొర్రూరు పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన రీజినల్ కో-ఆర్డినేటర్ ప్రత్యూష

▶▶ జిల్లా వ్యాప్తంగా 2,414 మంది హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4: జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారి ప్రత్యూష తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు 2,490 మంది విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 2,414 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేంద్రంలో 576 మంది పరీక్షకు హాజరు కానుండగా 561 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. తొర్రూరు పాఠశాల సెంటర్‌లో 576కు గాను 561 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

మరిపెడ పాఠశాల సెంటర్‌లో 536కు గాను 512 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరయ్యారని, ఇనుగుర్తి పాఠశాల సెంటర్‌లో 432కు గాను 417 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారని, నర్సింహులపేట పాఠశాల సెంటర్‌లో 370కు గాను 363 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో బాలురు 916 మంది, బాలికలు 1,498 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. తొర్రూరు, మరిపెడ, నర్సింహులపేట పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ ప్రత్యూష తెలిపారు.

కల్లంలో ఆరబెట్టిన మిర్చి చోరీ


ముల్కలపల్లి వద్ద కల్లంలోని మిర్చిని ఎత్తుకెళ్లిన దృశ్యం

డోర్నకల్, ఫిబ్రవరి 4 : మండలంలోని ముల్కలపల్లిలో ఆదివారం కల్లంలో ఆరబెట్టిన సుమారు క్వింటా మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు కాశబోయిన వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. ముల్కలపల్లికి చెందిన వెంకటేశ్వర్లు రెండెకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. ఇటీవల మిర్చిని తెంపి కల్లంలో ఆరబెట్టాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చి ఆదివారం ఉదయం కల్లం వద్దకు వెళ్లి చూడగా ఆరబెట్టిన మిర్చిలో సుమారు క్వింటాకు పైగా ఎత్తుకెళ్లినట్లు గుర్తించినట్లు చెప్పాడు. ఈ విషయంపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు వెంకటేశ్వర్లు తెలిపారు. మరోపక్క మిర్చి కల్లం పక్కనే ఉన్న చికెన్ సెంటర్‌లోని సుమారు వంద కోళ్లు (2 క్వింటాళ్లు) అపహరించుకుపోయినట్లు బిస్మిల్లా చికెన్ సెంటర్ యాజమాని మౌలాలీ తెలిపారు. మిర్చి ఎత్తుకెళ్లిన వారే తమ కోళ్లను అపహరించి ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కేసముద్రం, ఫిబ్రవరి 4 : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ పిలుపునిచ్చారు. కేసముద్రం విలేజి ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం నిర్వహించిన సంఘసమావేశంలో బానోత్ కైక, మట్టి ఏసు, చిన్ని, వీరమ్మ, యాకమ్మ, రంగమ్మ, భద్రమ్మ, విజయ, ద్వాలి, రామక్క పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

పెద్దవంగర, ఫిబ్రవరి 4 : ప్రజలందరి సహకారం, భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని రావుల కరుణాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో నానమ్మ రావుల కమలమ్మ జ్ఞాపకార్థం రూ.35వేల విలువైన 15 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. అప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరు బాధ్యత వహించి మొక్కలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండీ.ముక్తార్‌పాషా, రావుల వెంకటసోములు, ఎరుకలి సమ్మయ్య సంతోష్, కన్నె సతీష్, శ్రీనాథ్, సతీష్, సంతోష్, ప్రసాద్, సోమన్న, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


గంట్లకుంటలో ఏర్పాటు చేసిన బెంచీలతో గ్రామస్తులు

సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకోవాలి

నెల్లికుదురు సెంటర్, ఫిబ్రవరి 4 : బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను ఈ నెల 15న జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యుడు దారావత్ మోతీలాల్ నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ బంజారాలకు చూపిన మార్గాన్ని అనుసరించాలని కోరారు. జిల్లాలోని 18 మండలాల్లో సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని బోగ్ భండారో కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో దారావత్ వెంకన్ననాయక్, గుగులోతు నందులాల్‌నాయక్, భూక్య బాలునాయక్, అజ్మీర కల్యాణ్, జర్పుల దేవేందర్, బానోత్ నరేందర్, గుగులోతు అఖిల్, భూక్య సురేష్, వీరన్ననాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

తొర్రూరు, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తూ రెగ్యులర్ కాకుండా మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండలోని రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సాంకేతిక కారణాలతో అనేక మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కాకుండా మిగిలిపోయారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనరల్ కళాశాలల్లో 25 మంది, ఒకేషనల్ కళాశాలల్లో 411 మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కాలేదని, ప్రభుత్వం చొరవ చూపి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సురేఖతో ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కర్ణాకర్, జనార్దన్, ఐలయ్య, రాజు, కిషన్, రాము తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి నిధులు కేటాయించాలి

▶▶ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నేతల విజ్ఞప్తి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రాంచందర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్రీయ విద్యాలయ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు నలసాని ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మానుకోట పట్టణంలో 2015లో కేంద్రీయ విద్యాలయాన్ని స్థాపించగా ఇప్పటి వరకు సరైన భవనం లేదని చెప్పారు. స్థానిక గిరిజన బాలికల హాస్టల్‌లో పదవ తరగతి వరకు నడుస్తోందని పేర్కొన్నారు. వసతులు సరిగా లేక ఇంటర్మీడియట్ తరగతులను ఏర్పాటు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర వసతులతో పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, భవన నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరి చేయాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు వివరించారు.

నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలి

తొర్రూరు, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ నిబంధనల మేరకే బెల్లం(బంగారం) విక్రయాలు చేపట్టాలని తొర్రూరు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు అన్నారు. త్వరలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తులు భారీగా మొక్కులు చెల్లించుకునేందుకు బెల్లం(బంగారం) కొనుగోలు చేస్తారన్నారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని, అధిక ధరలకు విక్రయించవద్దన్నారు. కొనుగోలు దారుల నుంచి ఆధార్ కార్డు జిరాక్స్ కాపి, ఫోన్ నంబర్, అడ్రస్ వివరాలు తప్పనిసరిగా రికార్డులో నమోదు చేసి రోజువారి వివరాలను ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా విక్రయాలు చేపడితే చర్యలు ఉంటాయని సీఐ భాస్కర్‌రావు హెచ్చరించారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

▶▶ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్‌కు కార్యకర్తలే పట్టుకొమ్మలని, పార్టీ కోసం కష్టపడిన వారందరికీ ఫలితం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో యశస్వినిరెడ్డి గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ మరిచిపోమని అన్నారు. వచ్చే పార్లమెంట్, పట్టభద్రుల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన పేదప్రజలకు, కార్యకర్తలకు అందిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, నాయకులు హమ్యానాయక్, నాయకులు నిరంజన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, బాపురెడ్డి, మేకల కుమార్, అచ్చిరెడ్డి, రామ్మూర్తి, జలగం శ్రీను, ముద్దసాని సురేష్, కిషన్‌యాదవ్, వరప్రసాద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ రాజేందర్‌రెడ్డి సేవలు అభినందనీయం


రెడ్డికుంటతండాలో మహిళలకు చీరలు అందిస్తున్న నాయకులు

పెద్దవంగర, ఫిబ్రవరి 4 : సామాజిక సేవలో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి విజయ్‌పాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డికుంటతండాలో హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ట్రస్టు సేవలు ఎంతో అవసరమన్నారు. సమాజ అభ్యున్నతి కోసం అనేక సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగ్గానాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమురయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా సరస్వతి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4: మహిళా కాంగ్రెస్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శిగా లింగోజు సరస్వతి నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ ఆదివారం ప్రకటించి ఆమెకు నియామక పత్రం అందజేశారు. సరస్వతి అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. తన నియామకానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, నూనావత్ రాధ, సత్యమ నోరమ, గుగులోతు వెంకట్‌లకు సరస్వతి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐలో చేరిన న్యూడెమోక్రసీ నేతలు


భీముడు నాయక్‌కు సీపీఐ కండువా కప్పుతున్న విజయసారథి

గార్ల, ఫిబ్రవరి 4 : మండలంలోని మద్దివంచ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, న్యూడెమోక్రసీ నాయకుడు లావుడ్యా భీముడు నాయక్ నేతృత్వంలో 20 కుటుంబాలకు చెందిన వారు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సమక్షంలో సీపీఐ పార్టీలో ఆదివారం చేరారు. వారికి సీపీఐ కండువాలు కప్పి స్వాగతం పలికారు. రాంపురం, మద్దివంచ ప్రాంతాల్లో వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్ చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు సీపీఐ విధానాలు నచ్చి చేరుతున్నట్లు భీముడు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, బట్టు వీరన్న, రాగం రమేష్, దూపాటి జనార్దన్, మాగం లోకేశ్, కె.భిక్షమయ్య, ఇలుటూరి వెంకన్న పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4: మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా మత్స్య అభివృద్ధి బోర్డుతో పాటు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మార్చి వారి ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించాలని కోరారు. రాష్ట్రంలో మత్స్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్లసత్తయ్య, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కనకయ్య, ఆర్పీ రాజు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఇనుగుర్తి, ఫిబ్రవరి 4 : మండలంలోని లాలుతండాకు చెందిన 2013-14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పూర్వంలో తమతో చదువుకున్న భూక్య అశోక్ తండ్రి హాము రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. షేక్ యాకూబ్, వహెద్, రాకేష్, అనిల్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం

కేసముద్రం, ఫిబ్రవరి 4 : కేసముద్రం సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న బరిగల పాండు కుటుంబానికి రైల్వే శాఖ నుంచి రూ.25వేలు, సీసీఎస్ నుంచి రూ.10వేలను ఆదివారం సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాజమౌళి ఆదివారం మహబూబాబాద్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి ఆవుల యుగేందర్, వైస్ చైర్మన్ భాస్కరరావు, జేఈ సురేష్, సుధాకర్ వంశీ, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెద్దవంగర, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి ప్రాణాలను కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై సంపూర్ణ అవగాహన కోసం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలు నిండిన మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. క్యాన్సర్ నివారణ కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్ద వంగర ఆధ్వర్యంలో మండల కేంద్రంలో క్యాన్సర్ వైద్య నిపుణులతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చెకప్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పోస్ట్‌మాస్టర్ రాంచందర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 4 : క్రీడలతో ఒత్తిడిని అధిగమించడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని మానుకోట పోస్ట్‌మాస్టర్ పెండ్రా రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం వరంగల్ డివిజన్, మహబూబాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలోని ఉద్యోగులకు మానుకోట పోస్టల్ ప్రీమియర్ లీగ్(ఎంపీపీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ రాంచందర్ మాట్లాడుతూ... అనునిత్యం విధి నిర్వహణలో పని ఒత్తిడితో సతమతమయ్యే పోస్టల్ ఉద్యోగులు, సిబ్బందికి క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. అంతే కాకుండా క్రీడలతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోట సుధాకర్, వాసం అనిల్, తోట సురేష్, కోట సతీష్, జాటోతు యాకూబ్, బానోత్ సుధాకర్, కొమ్ముల బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రులకు సన్మానం


ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నెల్లికుదురు సెంటర్, ఫిబ్రవరి 4: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన గిరిజన ఎమ్మెల్యేలకు మార్చి 3న మహబూబాబాద్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పలువురు గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాటోతు వెంకన్న, కేలోతు మల్సూర్, భూక్య శంకర్, సాయికుమార్, గుగులోతు కిషన్ పాల్గొన్నారు.